జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 5-1-2025 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 210 పేజీలు: 4 వెల : రూ.7

## ఆరోగ్యకర సమాజానికి...
# విద్యార్థి దశే పునాది

*** బారువా అంటే గుర్తుకొచ్చేది స్వాతంత్ర్య సమరులే * అశోక్‌తో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా * నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకువస్తాం * కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * బారువ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం**




**సోంపేట, జనవరి 4 (వార్త):** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి విద్యార్థి దశే అత్యంత కీలకం. దీనికి అనుగుణంగా ప్రతి సామాన్యుడికీ ఉన్నత విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించడం మహత్తరమైన కార్యక్రమమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. దీనిపై ఎంతో చొరవ చూపిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషిని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూతనంగా ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సోంపేట మండలం బారువ ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపాటు కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ లతో కలిసి నేలపైనే కూర్చుని విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ బారువ అంటే ముందుగా గుర్తొచ్చేది స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న, జస్టిస్ పున్నయ్య అని తెలిపారు. వారి స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ అవసరమని స్పష్టం చేశారు. మహనీయుల స్ఫూర్తి తోనే ప్రభుత్వ పథకాలకు అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టినట్లు వివరించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత చదువులతో పాటు ఉన్నత కొలువులు సాధించినప్పుడే తల్లిదండ్రుల కలలను సాకారం చేసినట్లుగా భావించాలన్నారు. ఉన్నత చదువులు చదివి, ఒకేసారి రాజకీయాల వైపు అడుగులు వేసిన నాయకులుగా ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో తనకున్న అనుబంధాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు గుర్తు చేసుకున్నారు. తన తండ్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఆకస్మిక మరణంతో తాను, తండ్రి బెందాళం ప్రకాష్ మృతితో ఎమ్మెల్యే అశోక్.. 2014లో తొలిసారి పోటీ చేసి, గెలిచామన్నారు. అనంతరం 2019, 24 లో ఎంపీ, ఎమ్మెల్యే లుగా హ్యాట్రిక్ విజయంతో రికార్డు సాధించడంతో పాటు ఒకరం కేంద్ర మంత్రిగా, మరొకరు ప్రభుత్వ విప్ గా నియమితులైన విషయాన్ని వివరించారు. ఇద్దరం అన్నదమ్ముల్లా కలిసి ఉండటమే కాదు.. నియోజకవర్గ అభివృద్ధిలో జోడెద్దుల బండిలా ముందడుగు వేస్తామని తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంతో పాటు ఉత్తరాంధ్రకు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకు వచ్చి.. వలస నివారణతో పాటు యువతకు స్థానికంగానే ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో..
# ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

*** హైబ్రిడ్ మోడల్ పేరుతో ఆరోగ్యశ్రీలో మార్పు * ఏకంగా రూ.5800 కోట్ల అవినీతికి శ్రీకారం * ఆ విధానంతో సొంత ఇన్సూరెన్స్ కంపెనీకి దోచి పెట్టే కుట్ర * తిరిగి ఆ డబ్బంతా నారా లోకేశ్ జేబుల్లోకే * హెల్త్ కవరేజీ కేవలం రూ.5 లక్షల వరకే కుదింపు * కొత్త మోడల్‌తో ఖరీదైన చికిత్సలకు వైద్యం అనుమానమే**

*** దేశం మెచ్చుకున్న గొప్ప పథకానికి తూట్లు * సూపర్ సిక్స్‌తో సహా, ఏదీ అమలు చేయని ప్రభుత్వం * పథకాల అమలు చేయకనే రూ.1.19 లక్షల కోట్ల అప్పా! * పింఛన్లు, ఉద్యోగుల జీతాలకు ఏకంగా లక్ష కోట్లా? * చేసిన అప్పులకు, చేస్తున్న పనులకు పొంతన లేదు * మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజం**




**పలాస, జనవరి4 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకానికి నీరుగార్చడమే కాకుండా తాజాగా హైబ్రిడ్ మోడల్ పేరుతో దాదాపు రూ.6 వేల కోట్ల భారీ అవినీతికి శ్రీకారం చుట్టిందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు దుయ్యబట్టారు. ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పనంగా చెల్లించే ఆ డబ్బంతా తిరిగి నారా లోకేశ్ జేబుల్లోకే చేరబోతుందని విమర్శించారు. శనివారం పలాసలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ ట్రస్టు మోడల్ కన్నా ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న హైబ్రిడ్ మోడల్‌తో ఏం ఉపయోగాలున్నాయో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 5 లక్షల ఆదాయ పరిమితి ఉన్న 1.43 కోట్ల కుటుంబాలకు రూ.25 లక్షల వరకు రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ సేవలను ఉచితంగా అందించడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం ప్రకారం రూ.2.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆపై మరో రూ.2.5 లక్షలు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలందిస్తామని చెబుతున్నారని, ఇదే జరిగితే కాంక్లియర్ ఇంప్లాటేషన్, బోన్ మ్యారో సర్జరీ వంటి ఖరీదైన చికిత్సలు పేదవారికి ఉచితంగా అందే పరిస్థితి ఉండదన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్‌లు తిరస్కరిస్తే పరిస్థితి ఏమిటిటని, అత్యవసర వైద్యానికి అప్రూవల్ రావడంలో ఆలస్యమైతే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీలో 3257 ప్రొసీజర్లకు వైద్యం అందిస్తే, ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చే హైబ్రిడ్ మోడల్‌లో, అన్ని ప్రొసీజర్లకు వైద్యం అందుతుందన్న గ్యారెంటీ ఉండదని, ఉచితంగా మందులు ఇవ్వరని, రోగి హెల్త్ ప్రొఫైల్‌ని పరిగణలోకి తీసుకుంటే ఇన్సూరెన్స్ వర్తింపజేయరన్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్‌లో ఉన్న ఇబ్బందులను అధిగమించడమే లక్ష్యంగా దివంగత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ట్రస్ట్ మోడల్‌లో తీసుకొచ్చి వేగంగా వైద్య సేవలందించే విధానం తీసుకొచ్చారని, చంద్రబాబు మళ్లీ పాత విధానానికి తీసుకెళ్తున్నారన్నారు. ఇదంతా మంత్రి లేదా నారా లోకేష్‌కు సంబంధించిన వారి బీమా కంపెనీ కోసమే అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని సీదిరి ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కోసం ఐదేళ్లలో రూ.12,677 కోట్లు వెచ్చించగా, నేడు హైబ్రిడ్ మోడల్ కోసం దాదాపు రూ.19,218 కోట్లు ఖర్చు చేయబోతున్నారంటే ఇందులో దాదాపు రూ.5,800 కోట్ల అవినీతి కనిపిస్తోందన్నారు. ఇదంతా చూస్తుంటే చంద్రబాబు జేబులు నింపుకోవడమే సంపద సృష్టి అనుకోవాలేమో అని వ్యంగ్యంగా అన్నారు. ఏ పథకం అమలు చేయకుండానే కేవలం జీతాలు చెల్లించడానికి, పింఛన్లు ఇవ్వడానికి ఏడు నెలల్లో రూ.1.19 లక్షల కోట్ల అప్పు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ అప్పుల దెబ్బకు రాష్ట్రం శ్రీలంక కాదు.. సోమాలియా అయిపోతుందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆందోళన వ్యక్తం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ



**శ్రీకాకుళం, జనవరి 4(వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రం, వంశధార క్వార్టర్స్ ఆవరణంలో శనివారం అత్యవసర సమయం లో వైద్యం అందించే108 ఈ.యం.టి లకు జిల్లా ఏ.ఈ.ఎం.ఎస్ ఓ.ఈ నవీన్ పర్యవేక్షణలో ఆన్ జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా తరగతులు నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీలకు, నవజాత శిశువులకు ఎలా ప్రథమ చికిత్స చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డివిజన్ పరిధిలో ఉన్న 108 ఈ.యం.టి పాల్గొన్నారు

# అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**-శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి**

**-పలు రోడ్లకు శంకుస్థాపన**



**పోలాకి, జనవరి 4(వార్త):** అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం ఆయన ప్రియాగ్రహారం పంచాయతీ తెల్లవానిపేట నుంచి కాకినాడ పేట వరకు కోటి 65 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, కొల్లివలస బీటీ రోడ్ నుంచి మబగాం కల్వర్ట్ వరకు కోటి యాభై లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, సూరపు నారాయణదాసు, మండల పార్టీ అధ్యక్షుడు, మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, నీటి సంఘం అధ్యక్షుడు తిర్లింగి విశ్వనాథం, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఎంపీడీవో జీవీ రవికుమార్, సర్పంచ్ బేవర నూకరాజు, ఎంపీటీసీ సుంకరి ప్రసాద రావు, కూటమి నాయకులు కోరుకోల రామారావు నందుపల్లి దండాశి, మాజీ సర్పంచులు డోల ప్రసాద రావు, చింతు కర్రన్న, మడ్డు అప్పయ్య, లావేటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**తెల్లవానిపేటలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి**

తెల్లవానిపేట రోడ్డులో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రియాగ్రహారం సర్పంచ్ బేవర నూకరాజు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కోరారు. దీనికి ఆయన త్వరలోనే నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

## బోర్లకు మరమ్మతులు



**వంగర, జనవరి 4(వార్త):** మండలంలోని పటువర్ధనం గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి నల్ల మురళి ఆధ్వర్యంలో రెండు మంచినీటి బోర్లకు మెకానిక్ కృప మరమ్మతులు చేశారు. గ్రామంలో నీటి ఎద్దడి తీర్చడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ ప్రతినిధి మురళి అన్నారు.

## 31 లోపు రైతులు రెన్యువల్ చేసుకోండి

**వంగర, జనవరి 4(వార్త):** వంగర మండల శివం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులు తీసుకున్న రుణాలను ఈ నెల 31వ తేదీ లోగా రైతులు రెన్యువల్ చేసుకోవాలని ముఖ్య కార్య నిర్వహణ అధికారి (సీఈవో) ఎస్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ కెపోలి నాయుడు లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## నేడు భళ్లూకగిరిపై ఆధ్యాత్మిక కార్యక్రమాలు

**మందస, జనవరి 4(వార్త):** మందస మండలంలోని పిడీమందస, కుంటికోట, వీరగున్నమ్మపురం పరిధిలోని భళ్ళూకగిరిపై గల శ్రీ రామానంద యోగాశ్రమములో ఈ నెల 5న ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. గాయత్రి హెూమము, సత్సంఘము, పూజా కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

# మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలి



**రాజాం, జనవరి 4(వార్త):** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం ఆయన రాజాం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శ్రీకాకుళం - రాజాం - సాలూరుకు నూతన ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. దీనిపై ప్రయాణీకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాజాంలోని విజయ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు మంజూరైన డా.ఎన్టీఆర్ వైద్య సేవను ఆయన శనివారం ప్రారంభించారు.

# వలంటీర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి

**- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**



**పాతపట్నం, జనవరి 4(వార్త):** వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు తన పాలనా కాలంలో తీసుకువచ్చిన సమున్నత వ్యవస్థ వలంటీర్ల వ్యవస్థ. ప్రభుత్వ పథకాలను అర్హులకు ఎలాంటి అవి నీతికి, వివక్షకు తావులేకుండా చేరేలా చూడటానికి దాదాపు రెండున్నర లక్షల మంది యువతీ యువకులు నెలకు కేవలం ఐదువేల రూపాయలు చొప్పున పొందుతూ ప్రభుత్వానికీ- ప్రజలకూ మధ్య వారధిగా నిలిచారు. పదకొండు వేలకు పైగా ఉన్న గ్రామ సచివాలయాల నుండి ఆయా గ్రామాల- వార్డుల లోని ఇళ్ళ ముంగిటకు ప్రభుత్వ సేవలను చేర్చే వ్యవస్థ ఇది. ముఖ్యంగా నిరుపేదల, వృద్ధుల, దివ్యాంగుల, దీర్ఘరోగ పీడితుల మన్ననలను పొందుతూ ఇతర రాష్ట్రాలకు సహితం స్ఫూర్తిగా నిలిచింది. కరోనా లాంటి విపత్కర సమయంలో విశిష్ట సేవలు అందించింది. అటువంటి వ్యవస్థపై అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు గత ఐదేళ్ళలో ఎంతో బురద చల్లారు, దుష్ప్రచారం చేశారు. గోనె సంచులు మోసే ఉద్యోగమా అని అవమానించారు.కూటమి హామీ ఇచ్చిన సూపర్ -6లో ఏడాదికి నాలుగు లక్షలు చొప్పున 20 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామనే హామీ అమలు ప్రారంభం కాకపోగా, ఉన్న రెండున్నర లక్షల వలంటీర్లతో సహా మరెన్నో వేలమంది ఉపాధిని నిర్వీర్యం చేశారు. ఎంతో సదుద్దేశంతో జగన్ ప్రభుత్వం తెచ్చిన ఈ వ్యవస్థను మంచి బుద్ధితో కొనసాగించాల్సింది పోయి జగన్ మీది ద్వేషం, పగ, కక్షలతో ఆ వ్యవస్థను నిర్మూలించడానికే దురాలోచనలు చేస్తున్నారు. ఇది తగదు. తీరా ఎన్నికలు సమీపించేసరికి చంద్రబాబు వలంటీర్లను చంకకెత్తుకొని 'మీకు పదివేలు ఇస్తా, మీ నైపుణ్యాలను పెంచుతా, సంపన్నులను చేస్తా' అని ఆకాశానికి ఎత్తేశారు. ఇప్పుడు గెలిచి ప్రభుత్వం ఏర్పరిచాక వారి సేవలను కొనసాగించకుండా, పరోక్షంగా రద్దు చేసినట్లే ప్రవర్తిస్తున్నారు. సచివాలయ సిబ్బందినే ఇంటింటికి పంపి మొదటి నెలలో వలంటీర్లు లేకుండానే పెన్షన్లను డోర్ డెలివరీ చేశామని గొప్ప చెప్పుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి కొన్ని నెలలు గడుస్తున్నా వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించకపోవడంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న వలంటీర్లు ఇప్పుడు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. ఇదే బాబు నిర్వాకం వల్ల బెజవాడ బుడమేరు వరదలో మునిగితే, గతిలేని పరిస్థితుల్లో వలంటీర్లను పిలిచి ఉపయోగించుకున్నారు. పట్టించుకోవడం మానేశారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల విషయంలో స్పష్టమైన నిర్ణయం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు వలంటీర్లను విధుల్లోకి తీసుకుంటామని, ప్రతి నెల రూ.10 వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న వేతనాలను విడుదల చేసి, రాజీనామా చేసిన వలంటీర్లను కొనసాగించాలన్నారు.

# జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సాహిల్‌కుమార్



**పలాస, జనవరి 4(వార్త):** పాఠశాల క్రీడా సమాఖ్య ఎస్ జి ఎఫ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొడ్డపాడు విద్యార్థి రాపాక సాహిల్ కుమార్ ఎంపికైనట్లు పి డి సి హెచ్ ఆర్ రాంజీ తెలిపారు. క్రీడాకారుడికి పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీష అభినందనలు తెలియజేశారు. జీవితంలో మరింత ముందుకు వెళ్లి మన ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టాలని అభిలాషించారు. సాహిల్ తల్లి తండ్రులు రాపాక జగదీశ్, రమణమ్మలు. తండ్రి బ్యాడ్మింటన్ లో జాతీయ క్రీడాకారులుగా మంచి పేరు తెచ్చికున్నారు. అదే స్ఫూర్తితో తన తనయుడును కూడా తీర్చిదిద్దాలాని కుతూహలంతో ఉన్నారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ ఎం సి చైర్మన్ గర్తం తులసిరావు, పిడి రాంజీ, నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రీను, తెలుగు యువత అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, జి ఎం పల్లి గ్రామ వాస్తవ్యులు మాకన్నపల్లి పంచాయతీ వైస్ సర్పంచ్ రాపాక పురుషోత్తం, మాజీ వైస్ సర్పంచ్ రాపాక కూర్మారావు, తెలుగుదేశం యువనాయకుడు రాపాక జోగారావు తదితరులు పాల్గొని సాహిల్‌ను అభినందించారు.




## హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

**పలాస, జనవరి 4(వార్త):** హెల్మెట్ లేకుండా ప్రయాణం చాలా ప్రమాదకరమని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ అన్నారు. శనివారం కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పలాస ఇందిరా చౌక్ నుంచే ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా కాసేపు బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లేబర్ కాలనీ యూత్ అసోసియేషన్ యువకులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్టు



**పలాస, జనవరి 4(వార్త):**రైళ్లలో ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న దొంగను పలాస రైల్వే జీఆర్పీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 70 గ్రాములున్న రెండు బంగారు పుస్తెలతాళ్లను రికవరీ చేశారు. కోటబొమ్మాళి, తిలారు రైల్వే స్టేషన్‌లను అడ్డా చేసుకుని, చిన్న హరిశ్చంద్రపురానికి చెందిన ఈర గట్టపు రాము అలియాస్ విజయ్ దొంగతనాలకు పాల్పడుతున్నట్టు జీఆర్పీ లైన్స్ సీఐ ఏ.రవికుమార్ తెలిపారు. బాధితుల పిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు జీఆర్పీ ఎస్సై షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడు రాముని పలాసలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడ్ని విశాఖ రైల్వే కోర్టుకు తరలిస్తామన్నారు.

## పీఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్ విడుదల



పోలాకి, జనవరి 4(వార్త): ఏపీ పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ క్యాలెండర్ శనివారం విడుదల చేశారు. నరసన్నపేట సమితి మండల శాఖ ఆధ్వర్యంలో ఎంపిడిఓ జీవీ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు కింజరాపు నరసింహ మూర్తి మాట్లాడుతూ ప్రజాసేవకు ఉద్యోగులందరూ ముందుండాలన్నారు. కార్యక్రమంలో పోలాకి పరిషత్ వ్యవహారాల అధికారి సూర్యప్రకాష్, సిబ్బంది, నరసన్నపేట మండల పీఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నీలమణి దుర్గ హుండీ లెక్కింపు

**పాతపట్నం, జనవరి 4(వార్త):** పాతపట్నం గ్రామదేవత శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం హుండీ లెక్కింపు జరిగింది గత 78 రోజులకు గాను అమ్మవారికి 6,89,757 రూపాయలు ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వాహణాధికారి (ఈవో) టి.వాసుదేవరావు మీడియాకు తెలిపారు లెక్కింపు కార్యక్రమంలో శ్రీకాకుళం సహాయ కమిషనర్ కార్యాలయం నుండి సినియర్ అసిస్టెంట్,జీవీబీఎస్ రవికుమార్,రికార్డ్ అసిస్టెంట్ కోడి సుదర్శన్ రావు,ఆలయ అర్చకులు,టి.రాజేష్,టి.హరీష్, టి.సతీష్,భక్తులు,సిబ్బంది,శ్రీ వెంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఏబీవీపీ శ్రీకాకుళం మండల కమిటీ ఎన్నిక

**శ్రీకాకుళం, జనవరి 4(వార్త):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం మండల కమిటీను జిల్లా కన్వీనర్ బోర గోపి శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" మండల కన్వీనర్ గా గుజ్జల జయప్రకాష్ ను మండల కార్యదర్శిగా ఎచ్చెర్ల కళ్యాణ్ చక్రవర్తిని నియమించారు ..ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బోర గోపి, మీడియా కన్వీనర్ సింహాచలం మధు, ఏబీవీపీ సభ్యులు పాల్గొన్నారు.






## చినబాబుకు సతీ వియోగం..ఎమ్మెల్యే పరామర్శ

**రాజాం, జనవరి 4(వార్త):** ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి చినబాబు సతీమణి సరస్వతి శనివారం స్వర్గస్తులయ్యారు. దీంతో రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట రాజాం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

## నౌపడలో మేలుకొలుపులు



**సంతబొమ్మాళి, జనవరి 4(వార్త):** నౌపడ గ్రామంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతిరోజూ వేకువజామున యువకులు మేలుకొలుపులు ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సంక్రాంతి ప్రత్యేకతను భక్తి గీతాలతో యువకులు అవగాహన కలిగిస్తున్నారు. ఈ మేలుకొలుపులను నౌపడ గ్రామంలో అన్ని వీధులతో పాటు సీతానగరం, మూడు రోడ్ల జంక్షన్ వరకు వేకువజామున సంక్రాంతి వరకు ప్రతిరోజు నిర్వహిస్తుంటారు. కార్యక్రమంలో యువకులు మల్లేశ్వర భజన బృందం తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్‌లో సంతబొమ్మాళి విద్యార్థుల ప్రతిభ



**సంతబొమ్మాళి, జనవరి 4(వార్త):** మండల లెవెల్ బయోలాజికల్ టాలెంట్ టెస్ట్ లో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరచి ప్రధమ స్థానంలో నిలిచారు. స్థానిక ఉన్నత పాఠశాల లో శనివారం నిర్వహించిన ఈ టాలెంట్ టెస్ట్ లో మండలం లో ని 11ఉన్నత పాఠశాల ల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 50 మార్కులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించగా సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 50 మార్కులకు 36 మార్కులు సాధించి ప్రధమ స్థానం పొందారు. ఈ విద్యార్థులు వచ్చే నెల 9న జరగనున్న జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని హెచ్ ఎం కామరాజు తెలిపారు. ప్రధమ స్థానం లో నిలిచిన విద్యార్థుల కు హెచ్ ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**సంతబొమ్మాళి, జనవరి 4(వార్త):** బోరుభద్ర, సంతబొమ్మాళి పంచాయతీ పరిధిలో గల కిరాణా, పాన్ షాపులలో ఎస్పి ఆదేశాలతో సంతబొమ్మాళి ఎస్సై సింహాచలం నేతృత్వంలో శనివారం నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. వ్యాపారస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. మాదకద్రవ్యాలు అమ్మటం కొనటం చట్టరీత్యా నేరమని నిబంధన అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి డ్రగ్స్ సేవించే, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాలేశ్వరస్వామి స్వామి గుడి దగ్గర సైబర్ నేరాలు మాదకద్రవ్యాల వినియోగంపై యువతకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని, ప్రజలు సైతం తమ గ్రామాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి ఎంతోమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వివరించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా సత్ప్రవర్తనలో ఉండాలని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలలో సిబ్బంది పాల్గొన్నారు.



# పలాసకు ఉద్దాన ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా

- కిడ్నీ హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేస్తాం
- హాస్పిటల్ సిబ్బందికి తక్షణం జీతాలు చెల్లింపు
-కలెక్టర్ స్వప్నికల్ దినకర్



పలాస, జనవరి 4, (వార్త): ఉద్దానం ప్రాజెక్టు ద్వారా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి శాశ్వత మంచినీటి సరఫరా ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ కిడ్నీ ఆసుపత్రిని అప్గ్రేట్ చేస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండకర్ అన్నారు. శనివారం పలాస ఎమ్మెల్యే గౌత శిరీష ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పలాస మున్సిపాలిటీ అభివృద్ధిపై ఇచ్చిన వినతి పత్రం మేరకు జిల్లా కలెక్టర్ ఉద్దానం మంచి నీటి ప్రాజెక్టు ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కి ఉద్దానం ప్రాజెక్టు ద్వారా ఎటువంటి ఖర్చు లేకుండా శాశ్వత మంచినీటి సరఫరాకు తగు చర్యలు చేపడతామని అన్నారు. ఈ మంచి నీటి సరఫరాపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే కిడ్నీ ఆసుపత్రి అప్గ్రేడ్ చేసి గత 14 నెలలుగా జీతాలు లేకుండా సేవలందిస్తున్న సిబ్బందికి తక్షణమే జీతాలు ఏర్పాటు చేస్తామని మరియు అదనపు సిబ్బందిని రిక్రూట్మెంట్ చేస్తామని అన్నారు అనంతరం కేంద్రీయ విశ్వవిద్యాలయం స్థల పరిశీలన చేశారు. అనంతరం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ లో గల రెవెన్యూ పై శానిటేషన్ పై డంపింగ్ యార్డ్ చెత్త తొలగింపు పై అధికారులతో వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో శానిటేషన్ పై అలాగే అభివృద్ధిపై పూర్తిగా దృష్టి సారించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని మున్సిపాలిటీలతోపాటు పలాస మున్సిపాలిటీ కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. సమీక్ష సమావేశంలో పలాస మున్సిపాలిటీ కమిషనర్ నడిపేనా రామారావు, పలాస తాసిల్దార్ టి కళ్యాణ్ చక్రవర్తి, డి ఈ కనకరాజు, ఆర్ ఐ ఖాగేశ్వరరావు, టిడిపి నాయకులు పిరుకట్ల విట్టల్, సప్ప నవీన్, బడ్డ నాగరాజు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# అభ్యుదయ రైతు రమణమూర్తి దంపతులకు ఘన సన్మానం



**సంతబొమ్మాళి, జనవరి 4(వార్త):** గుంటూరు జిల్లా వడ్లమూడి గ్రామం విజ్ఞాన్ వ్యవసాయ యూనివర్సిటీలో అభ్యుదయ రైతులకు శనివారం ఘనంగా సన్మానం చేశారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం లక్ష్మి పురం గ్రామం నుంచి తంగి విజయ రమణమూర్తి దంపతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు కింజరాపు అచ్చం నాయుడు విజ్ఞాన్ వ్యవసాయ యూనివర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పార్లమెంట్ సభ్యులు గుంటూరు వారి ఆధ్వర్యంలో ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సేంద్రీయ వ్యవసాయ అధికారులు జిల్లా తరఫున రమణ మూర్తి దంపతులు ను గుర్తించి సన్మానం చేసినందుకు జిల్లా అధికారులకు మరియు రాష్ట్ర మంత్రివర్యులు కింజరాపు అచ్చం నాయుడు మరియు కేంద్ర మంత్రివర్యులు శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు మమ్మల్ని ఎంతగా ప్రోత్సహించిన కింజరాపు కుటుంబ సభ్యులకు రమణమూర్తి విజయ దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.

# డీఎంహెచ్‌వోను సన్మానించిన ఫార్మసీ అసోసియేషన్

**శ్రీకాకుళం, జనవరి 4(వార్త):** శ్రీకాకుళం జిల్లా ఫార్మసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు డీఎంహెచ్ఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బాలమురళీకృష్ణకు ఘనంగా సన్మానించారు. జిల్లా ఫార్మసీ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆయన చేతుల మీదగా ఆవిష్కరించారు. డి ఎం ఎన్ హెచ్ ఓ గా విధులు నిర్వహించి ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజ్ కు ప్రిన్సిపాల్ గా బదిలీ అయినా మీనాక్షి కు సన్మానించి ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ . సుబ్రహ్మణ్యం (దండు గోపాలపురం ఫార్మసిస్ట్), స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి. గోపాల్, జిల్లా ఫార్మసీ అసోసియేషన్ సెక్రటరీ కరణం మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, జనార్ధన రావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



**నందిగాం, జనవరి 4(వార్త):** లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకు కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె రాణీ అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా నందిగాం భవిత కేంద్రంలో నందిగాం %వీజూ% 2 చిన్నారావు, నందిగాం హెచ్.ఎం హరిబాబు లఖిదాసపురం, హెచ్.ఎం , సిహెచ్ కృష్ణారావు లా ఆధ్వర్యం లో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించారు. స్పర్శ కోడ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో లూయిస్ పాత్ర ఉందన్నారు. అంధుల పాలిట ఆరాధ్య దైవం లూయీ బ్రెయిలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో బి రామారావు, ఆర్ వెంకటరమణ , లక్ష్మీ , పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### వివేకానంద విద్యానికేతన్‌లో

**మందస, జనవరి 4(వార్త):** మందస పట్టణంలోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ఆవరణంలో లూయిస్ బ్రెయిలీవివేకానంద విద్యానికేతన్ లో లూయిస్ బ్రెయిలీ జయంతివేడుకలు మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. మందసకు చెందిన అంధ కళాకారుడైన లక్ష్మీనరసింహకు భాస్కరరావు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. బ్రెయిలీసుస్లేట్, బ్లైండ్ స్టిక్ బహుకరించారు. పాఠశాల ఏవో బి.కామేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు.





### భవిత కేంద్రంలో..

**ఇచ్ఛాపురం, జనవరి4(వార్త):** ముత్యాలమ్మ పేట భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంధుల లిపి రూపకర్త బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విద్యాశాఖాధికారి 2 ఎస్. విశ్వనాథం గారు. మండల ఏ ఈ సునీల్ , ఉపాధ్యాయులు ఉదయ్ భాస్కర్ సర్ మరియు నాగమణి, కామేష్, రవి సత్యనారాయణ, దేవ రాజు,గణేష్ రాంబాబు మరియు సహిత ఉపాధ్యాయులు సూర్యం సోమేష్ పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



**వంగర, జనవరి 4(వార్త):** గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్సై షేక్ శంకర్ హెచ్చరించారు. శనివారం రాత్రి అరసాడ గ్రామంలో యువత, ప్రజలతో వారు సమావేశయ్యారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు మజ్జి గణపతిని అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకే ..

# కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

### రాజాం, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష





**రాజాం, జనవరి 4(వార్త):** రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శనివారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో పలు సంస్కరణల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



**పోలాకి, జనవరి 4(వార్త):** ప్రియాగ్రహారంలోని గరిమెళ్ల సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పోలాకి జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని శనివారం నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో పలు సంస్కరణల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందన్నారు. మధ్యాహ్నం భోజనాన్ని గతంలో టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగకుమారి, ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం ..




**పలాస, జనవరి 4(వార్త):** విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందిని, ఆకలి తీర్చే అన్నపూర్ణమ్మ తల్లి డొక్కా సీతమ్మని, తెలుగుజాతి ఉన్నంతవరకు డొక్కా సీతమ్మను మర్చిపోలేమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కే నరసింహమూర్తి ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల యొక్క కష్టాలను చూసి ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లో ఒక మంచి ఆలోచన చేస్తూ హై స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఉండడంతోపాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయాలని సదుద్దేశంతో ఈ పథకం పెట్టారని దీనివల్ల రాష్ట్రంలో ఎన్నో లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పడుతుందని అన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు బాధపడుతుండడాన్ని తెలుసుకొని మంచి పౌష్టికాహారాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. విద్యార్థులు తమ యొక్క భవిష్యత్తును ఇక్కడినుంచే కట్టడి చేసుకోవాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మంచిని దగ్గర పెట్టుకొని చెడును దూరంగా పెట్టి జీవిత గమ్యాన్ని ఎంచుకోవాలని అన్నారు. అన్నం, అమ్మ, ఆరోగ్యం లేనప్పుడు జీవితంలో మరేమీ ఉండదని సర్వం కోల్పోతామని ఈ విషయమే ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఈవో తిరుమల చైతన్య, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పీరుకట్లల విఠల్ రావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, ఎంపీడీవో వసంత్ కుమార్,పశువైద్య సహాయ సంచాలకులు చంద్ర శేఖర్, కళాశాల అధ్యాపకులు హనుమంతు రామ్మోహన్ దొర, మధుర చరిత్రకారుడు కొండల మధుబాబు, తమ్మినేని పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో రాణించాలి..

**వంగర, జనవరి 4(వార్త):** వంగర మండలంలోని మడ్డువలస జునియర్ కాలేజీలో 216 మంది ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ను వంగర మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు ప్రారంభించారు. శనివారం ఆయన మండలంలో మడ్డువలస జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ను విద్యార్థులకు అన్నం వడ్డించి, విద్యార్థులతో తను తింటూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు చాలా ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారని, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత ఐదేళ్లుగా అమలు కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం అమలు చేశామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు ఎక్కువగా చదువుతుంటారని, మండల కేంద్రాల్లో ఉండే ఈ కళాశాలలకు సూదూర గ్రామాల నుంచి విద్యార్థులు రోజూ రాకపోకలు సాగిస్తుంటారన్నారు. మధ్యాహ్నం భోజనాన్ని ఉదయాన్నే వెంట తెచ్చుకుంటుంటారని, వీరి ఇబ్బందులను గమనించిన గత టీడీపీ ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కొరటాన. నారాయణరావు, లెక్చిరర్లు ఈశ్వరరావు, బాలగపోలి నాయుడు, మాజీ ఎంపీపీ ప్రతినిధి దుర్గ బాబు, మాజీ సర్పంచ్‌లు బి.సంగన్నాయుడు, కొండచాకరాపల్లి మాజీ ఎంపీటీసీ రమేష్, సిఆర్‌పి వాసు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



**మెళియాపుట్టి, జనవరి 4(వార్త):** జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు సైతం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంను ఏర్పాటు చేసిందని దీంతో విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడంతోపాటు చదువులలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల ప్రత్యేకధికారి లింగాల వెంకట మధుబాబు అన్నారు. ఎస్.డి.ఆర్.ఆర్.ఎం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నాడు ప్రారంభమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మండల ప్రత్యేకాధికారి ఎల్.వి. మధు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనే విద్యార్థులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని వివిధ అంశాలపై మాట్లాడుతున్ననే, వంట ఎజన్సీలు కూడా ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పదార్థాలను తయారు చేస్తూ విద్యార్థులకు నచ్చేవిధంగా వంట ఉండాలని సూచించారు. అనంతరం జరిగిన భోజన కార్యక్రమం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు. ఈ కార్యక్రమం ప్రత్యేక అధికారితో పాటు కళాశాల ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, ఎంపిడీఓ నర్సింహుపండా, డిప్యూటీ తహసిల్దార్ కె. రాము, మండల విద్యాశాఖ అధికారి ఎం. పద్మనాభరావు, ఎడ్యుకేషన్ నోడల్ అధికారి యు. గణపతిరావు, కళాశాల అధ్యాపకులు ఇ. మాధవరావు, ఎస్. భాస్కరరావు, ఎన్ సంతోష్ కుమార్ టి. మాధురీదేవి, సంజయ్ కుమార్, వీఆర్వో, కార్యదర్శి అప్పారావు, మహిళా పోలీస్ భారతి, అధ్యాపకులు, హైస్కూల్ ఎస్.ఎం.సి చైర్మన్ బి. చిన్నబాబు, సిబ్బంది తదితరులున్నారు.





## కొయ్యాం జీజేసీ కళాశాలలో..

**ఎచ్చెర్ల, జనవరి 4(వార్త):** మద్యాహ్న భోజన పథకం పేద మద్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వరమని పలువురు కూటమి ప్రభుత్వ ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల మండల పరిధిలో ఉన్న కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మద్యాహ్న భోజన పథకాన్ని స్థానిక సర్పంచ్ జీరు అయ్యప్పరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు, ఏజీఎంసీ సనపల షన్ముఖరావు, ఎంపిటిసి సభ్యులు మజ్జి జగదీష్, ఎండీఎం ఏజెన్సీ నర్సింహమూర్తి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శభాష్.. సంతోష్

* ఐదువేలు పైబడి టీడీపీ సభ్యత్వ నమోదు
* అభినందించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



**శ్రీకాకుళం, జనవరి 4 (వార్త):**తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా గత రెండు నెలలుగా చేపడుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శ్రీకాకుళం నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు అంధవరపు సంతోష్ రిఫరల్ కోడ్ ద్వారా ఐదు వేల పైబడి కార్యకర్తలతో పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించారు. దీంతో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అంధవరపు సంతోష్‌ను అభినందించారు.

# అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

* విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత



**శ్రీకాకుళం టౌన్, జనవరి4 (వార్త):** లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకి కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా విభిన్న ప్రతిభా వంతుల సహాయ సంచాలకులు కవిత, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాల మాన్ సింగ్, స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబం ధాల అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.శ్రీను అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభా వంతుల సహాయ సంచాలకులు కవిత మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ 1809 సంవత్సరం జనవరి 4 పారిస్‌కు తూర్పున ఇరవై మైళ్ల దూరంలో ఉన్నహెుకూ ప్రేహె అనే చిన్న గ్రామంలో జన్మించారని, బ్రెయిలీ తల్లిదండ్రులు చేస్తున్న పనిలో నిమగ్నమై ఉండగా ఆ సమయంలో కత్తితో ఆడుతుండగా కత్తి యొక్క చివరి భాగంగా తన కంటికి తగలడం వల్ల చిన్న వయసులోనే తన చూపును కోల్పోవడం జరిగిందన్నారు. బ్రెయిలీ తన చూపు కోల్పోయిందని నిరాశ పడకుండా తోబుట్టువులతో కలిసి పాఠశాలకు వెళ్లి చదువును కొనసాగించారని. అలాగే లూయిస్ బ్రెయిలీ అంధుల లిపిని 12 నుంచి 6 చుక్కలకి కుదించి అంధుల పాలిట ఆరాధ్య దైవంగా నిలిచారని, స్పర్శ కోడ్ వ్యవస్థను అభివృద్ధి చేయడం వలన ఈరోజు అంధులు ఉన్నతి స్థితిలో ఉండడానికి ముఖ్య కారణమన్నారు. ఈ కార్యక్రమంలొ వివిధ విసిఎ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు.

**విభిన్న ప్రతిభావంతులు.. ప్రతిభా వంతులు..**

విభిన్న ప్రతిభావంతులలో మంచి ప్రతిభా వంతులు ఉన్నారని డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్ తెలిపారు. లూయి బ్రెయిలీ జయంతి వేడుకలు సందర్భంగా శనివారం డిఆర్డిఎ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందగలిగారంటే లూయిస్ బ్రెయిలీ కారణమన్నారు. అందులకు ఉపయోగకరమైన లిపిని లూయిస్ బ్రెయిలీ కనిపెట్టినట్లు చెప్పారు. బిసి సంక్షేమ శాఖ అధికారి అనూరాధ మాట్లాడుతూ లిపి ద్వారా ఎంతో మందికి పునర్జన్మ కల్పించినట్లు వివరించారు. సిపిఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ఆయన కనుగొన్న లిపి ద్వారా ఎంతో మందికి ఉపయోకరంగా ఉందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం మంచి అవకాశాలను కల్పిస్తుందని, విభిన్న ప్రతిభా వంతులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఒలింపిక్స్ లో కూడా ఎక్కువ పతకాలు వచ్చాయని తెలిపారు. విభిన్న ప్రతిభా వంతుల శాఖ సహాయ సంచాలకులు కవిత మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు సమస్యలు ఏవైనా ఉంటే జిల్లా అధికారులను సంప్రదించాలని, తమ పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని పరిష్కరిస్తామన్నారు. అమ్మినాయుడు మాట్లాడుతూ లూయి బ్రెయిలీ విగ్రహం ఏర్పాటుకు తన వంతు పది వేల రూపాయలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. లూయిస్ బ్రెయిలీ కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సమావేశంలో డిఐపిఆర్ఓ కె.చెన్నకేశవరావు, సెట్విస్ సిఈఓ ప్రసాదరావు, విభిన్న ప్రతిభావంతులు, తదితరులు పాల్గొన్నారు.




# ఐదో రోజు 129మంది ఎంపిక

**శ్రీకాకుళం క్రైం, జనవరి 4(వార్త):** పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ ప్రక్రియలో భాగంగా 330 మంది మహిళ అభ్యర్థులు శనివారం 330 దేహదారుఢ్య పరీక్షల్లో హాజరుకాగా, 129 మంది అర్హత సాధించారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, బరువు, 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు మహిళ అధికారుల సమక్షంలో పకడ్బందీగా నిర్వహించారు. సోమవారం నుంచి యదావిధిగా కాల్ లెటర్‌లో తెలిపిన అన్ని ధ్రువీకరణ పత్రాలతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించిన ఒక సెట్టు జిరాక్స్ కాపీలతో అభ్యర్థులు హాజరుకావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. ప్రతిభ, సామర్థ్యం ఆధారంగానే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.




## విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

**శ్రీకాకుళం టౌన్, జనవరి 4(వార్త):** విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం కళింగపట్నం కోకావారి ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాల్లో చదువుతున్న విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలల తరహా లోనే జూనియర్ కళాశాలల్లో కూడా విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందు బాటులోకి తెచ్చిందన్నారు. 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం' పేరుతో ఇంటర్ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## మృతుల కుటుంబాలకు పరామర్శ

**పొందూరు, జనవరి4 (వార్త):**మండలంలో ఇటీవలె మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ శనివారం పరామర్శించారు. మండల కేంద్రంలోని వైస్ ఎంపీపీ కాకర్ల చెల్లమాంబ భర్త రాజారావు మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలానే గోరింటలోని మండల పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి వరదరాజులు తల్లి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరా మర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈయనతో మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామమోహనరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరిరావు, కాలెపు శ్రీని వాసరావు, తదితరులున్నారు.

## విద్యార్థుల ఆకలి తీర్చేందుకే మధ్యాహ్న భోజనం



**పొందూరు, జనవరి4 (వార్త):** కింతలి, పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం శనివారం ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల టీడీపీ అధ్యక్షుడు చిగిలి పల్లి రామమోహనరావు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఇజ్జాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కింతలి గ్రామంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన వెంకటసత్యనారాయణ, సర్పంచ్ పైడిరామ్‌ప్రసాద్, ఎంపీటీసీ హనుమంతరావు, ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

**పాతపట్నం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మండల ప్రత్యే కాధికారి, తహసీల్దార్, ఎంపీడీవో శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని మంచి ఆరోగ్యాన్ని పొంది, తద్వారా మంచి ఫలితాలు సాధించాలన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో 469 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారందరికీ ఈ భోజన పథకాన్ని వర్తింప చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. భోజన పథకానికి కావాల్సిన సామగ్రిని సమకూర్చుకుందామని, ఎటువంటి ఆటం కాలు లేకుండా విద్యార్థులందరికీ సకాలంలో భోజనమందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో చంద్ర కుమారి, జూనియర్ కాలేజ్ ప్రిన్సి పాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546